# తక్కువ ఫీజులకే చైనాలో వైద్య విద్య

## విద్యార్థులకు లియోనింగ్ మెడికల్ యూనివర్సిటీ ఆహ్వానం




హైదరాబాద్,ఆంధ్రప్రభ ప్రతినిధి

వైద్య విద్యను అభ్యసించాలని ఆశించే నగర విద్యార్థులకు శుభవార్త. అతి తక్కువ ఫీజులతోనే వైద్య విద్య పూర్తి చేయాలనుకుంటున్నారా ? అయితే చైనాలోని లియోనింగ్ మెడికల్ యూనివర్సిటీ మిమ్మల్ని ఆహ్వానిస్తోంది. నాణ్యమైన విద్యా ప్రమాణాలు, అత్యుత్తమ బోధనా సిబ్బంది, ఆధునిక సౌకర్యాలతో వైద్య విద్యను అందిస్తోంది. నగరంలోని మెడికో అబ్రాడ్ సంస్థ సహకారంతో విదేశీ విద్యార్థులను ముఖ్యంగా ఈ-లర్నింగ్ పద్దతి బాగా అభివృద్ధి చెందిన హైదరాబాద్ నగర యువత లక్ష్యంగా ఆ యూనివర్సిటీకి చెందిన బృందం ఇక్కడ పర్యటిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో యూనివర్సిటి విసి ప్రొ.ఎల్వి గాంగ్, అంతర్జాతీయ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రొ.పాల్ లియాంగ్, గ్జు జున్, వాన్ యైజింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లియాంగ్ మాట్లాడుతూ మిలియన్ చదరపు మీటర్ల స్థలంలో నిర్మితమైన లియోనింగ్ యూనివర్సిటీలో 15, 000 మంది విద్యార్థులు, 3880 మంది బోధనా సిబ్బంది ఉన్నారనీ, 3 అనుబంధ కళాశాలలున్నట్లు చెప్పారు.

చైనాలో వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం సీట్లను పెంచుతుందనీ, దీంతో సెమిస్టర్‌కు రూ. 90 వేల అతి తక్కువ ఫీజుతో, కేవలం రూ. 16 లక్షల వ్యయంలోపే ఎంబిబిఎస్ డిగ్రీ పొందే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ నుంచి వందలాది మంది తమ యూనివర్సిటీ నుంచి ఎంబిబిఎస్ పట్టాలు పొందారనీ, దీనికి ఎంసిఐ గుర్తింపు కూడా ఉందని వివరించారు. సమావేశంలో మెడికో అబ్రాడ్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వి.ఆర్.రాం పాల్గొన్నారు.